సామాన్యుడి నడ్డి విరిచేలా విద్యుత్‌ చార్జీలు

వైఎస్సార్‌ సీపీ పేట ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్‌: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాన్యుల నడ్డి విరిచేలా విద్యుత్‌ చార్జీలు పెంచిందని వైఎస్సార్‌ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్‌ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు అడ్డగోలుగా ప్రజల మీద భారం మోపిన కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో సెంటర్‌లో ఉన్న విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే విద్యుత్‌ చార్జీలను పెంచబోమని, ఉన్న చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించి ట్రూఅప్‌ పేరుతో విద్యుత్‌ చార్జీలను దారుణంగా పెంచారని మండిపడ్డారు. పేదలపై రూ. 15,500 కోట్ల భారం మోపారని పేర్కొన్నారు. సూపర్‌ సిక్స్‌ అమలు చేస్తామని చెప్పి వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు.

సంపద సృష్టి అంటే విద్యుత్‌ చార్జీలు పెంచడమేనా..?

నాడు మాజీ సీఎం వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర భగవద్గీత, బైబిల్‌, ఖురాన్‌ల వలే భావించి సంక్షేమ పాలన అందించారని, అభివృద్ధిని పరుగులు పెట్టించారని తన్నీరు నాగేశ్వరరావు గుర్తుచేశారు. కానీ తన పాలనలో సంక్షేమ పథకాల నిర్వహణకు సంపద సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు సంపద సృష్టించడం అంటే ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్‌ చార్జీలు, గ్యాస్‌ చార్జీలు, విద్యుత్‌ చార్జీలు పెంచడమేనా అని ప్రశ్నించారు. నాడు జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్‌ను కారుచౌకగా యూనిట్‌ రూ. 2.49 పైసలకే కొనుగోలు చేస్తే గగ్గోలు పెట్టారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం యాక్సిస్‌ సంస్థతో రూ. 4.50 పైసలకు కొనుగోలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కూటమి ఏడాది పాలనంతా తప్పుడు కేసులు, కక్ష సాధింపు రాజకీయాలతోనే సాగిందన్నారు. పెంచిన విద్యుత్‌ చార్జీల నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకొని ప్రజలపై మోపిన భారాన్ని తగ్గించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి విద్యుత్‌శాఖ ఏడీ జె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ హఫీజున్నీసా ఫిరోజ్‌, పార్టీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి చౌడవరపు జగదీష్‌, రాష్ట్ర ఎస్సీ సెల్‌ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్‌, రాష్ట్ర బీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు వేముల మల్లేశ్వరరావు, నాగబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్‌ నాయకుడు బద్దూనాయక్‌, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో విద్యుత్‌శాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు

పేదలపై మోయలేని భారం

నందిగామ టౌన్‌: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్‌ చార్జీల భారాన్ని సామాన్య ప్రజలు మోయలేకపోతున్నారని వైఎస్సార్‌ సీపీ నాయకులు పేర్కొన్నారు. విద్యుత్‌ చార్జీలు తగ్గించాలని, ట్రూఅప్‌ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మొండితోక జగన్‌మోహనరావు ఆదేశాల మేరకు వైఎస్సార్‌ సీపీ నాయకులు విద్యుత్‌ శాఖ ఏడీఈ స్టాలిన్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్‌ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామన్న కూటమి నేతలు అధికారంలోకి రాగానే సామాన్య ప్రజల నడ్డి విరిచేలా విద్యుత్‌ చార్జీలు పెంచారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వెంటనే విద్యుత్‌ చార్జీలను తగ్గించి, ట్రూఅప్‌ చార్జీలను రద్దు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ పట్టణ, మండల కన్వీనర్‌లు మహ్మద్‌ మస్తాన్‌, మంచాల చంద్రశేఖర్‌, జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైస్‌ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాకాలపాటి కృష్ణ, నాయకులు చిలుకూరి బుచ్చిరెడ్డి, గాడిపర్తి రామకృష్ణ, తోట అంజారావు, కరి రవీంద్ర, షేక్‌ యాకుబ్‌ అలి, పెసరమల్లి స్టాలిన్‌, వల్లెపు రవి, కోలేటి సుబ్బారావు, వడ్డెల్లి శ్రీను, షేక్‌ సుభానీ, పిల్లి జయరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామలో వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

క్లుప్తంగా

నేడు వాసవీ మాత జన్మదిన వేడుకలు

నందిగామ రూరల్‌: పట్టణంలోని శ్రీపురంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి శ్రీచక్ర మందిరంలో అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మారం వెంకటేశ్వరరావు, చవట నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ అమ్మవారి జన్మదిన వేడుకల సందర్భంగా సుప్రభాత సేవ, గణపతి పూజ, కలశ స్థాపన(108 కలశాలతో), అష్టోత్తర కలశాలతో అమ్మవారికి తిరువంజనం, లక్ష మల్లెలార్చన తదితర పూజలు, అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామ రూరల్‌: పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎండ వేడిమితో భానుడు విజృంభించినప్పటికీ రాత్రి సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో పంట కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం రైతులు పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. పట్టణంలోని పల్లపు ప్రాంత రోడ్లు జలమయమయ్యాయి. ఈదురు గాలులు బలంగా వీయడంతో చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ సమీపంలో సుబాబుల్‌ చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో నందిగామ–చందర్లపాడు రహదారిలో కొద్దిసేపు ట్రాఫిక్‌ నిలిచిపోయింది.

కిక్‌ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



జగ్గయ్యపేట: రాష్ట్ర స్థాయి కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో పట్టణంలోని వారియర్‌ మార్షల్స్‌ ఆర్ట్స్‌ కేంద్ర విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇటీవల విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీలో 35వ రాష్ట్ర స్థాయి కిక్‌ బాక్సింగ్‌ చాంఫియన్‌ షిప్‌–2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అకాడమీకి చెందిన యశ్వంత్‌, అక్షయ, ద్యానిక, వినయశ్రీ గోల్డ్‌, బ్రింజల్‌ మెడల్స్‌ సాధించారని అకాడమీ ప్రతినిధి పూజ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని అకాడమీలో విద్యార్థులను అభినందించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

చందర్లపాడు(నందిగామ టౌన్‌): చందర్లపాడు ముప్పాళ్ల గ్రామంలో జరిగిన వివాదంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాల గురవయ్య, పోతురాజు కుటుంబాల మధ్య పాత కక్షల నేపథ్యంలో మంగళవారం వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో పోతురాజు గురవయ్య ఇంటి మీదకు వెళ్లాడు. దీంతో గురవయ్య ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు గురవయ్య మృతదేహంతో పోతురాజు ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రతిభ చూపిన విద్యార్థులకు విమాన ప్రయాణం

నందిగామ టౌన్‌: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులను ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులతో కలిసి ఆమె గన్నవరం నుంచి హైదరాబాద్‌ వరకు విమాన ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విమానం ఎక్కాలనే నిరుపేద విద్యార్థుల ఆకాంక్షను నెరవేర్చేందుకే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

రేపు శ్రీసీతారామస్వామి ఆలయ భూముల వేలం

పెండ్యాల(కంచికచర్ల): మండలంలోని పెండ్యాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీసీతారామస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం ఆలయానికి సంబంధించిన భూముల కౌలుకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ ఎస్‌.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించిన 10 ఎకరాల భూములను దేవదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా వేలం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఈఓ సూచించారు.

ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలి

గండ్రాయి(జగ్గయ్యపేట): వేసవి కాలం దృష్ట్యా అన్ని గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని భూచవరం వైద్యాధికారి డాక్టర్‌ స్రవంతి సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వృద్ధులు, చిన్నారులు ఉక్కపోత, వడగాలులతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. బోధకాలు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చిన క్లీనింగ్‌ కిట్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్‌లు వెంకట్రావ్‌, అలివేలమ్మ, ఫార్మసిస్ట్‌ అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.

నరసింహుని కల్యాణ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో నితిన్‌, అధికారులు

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవ ఏర్పాట్లను ఎంపీడీవో నితిన్‌ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల ఏడు నుంచి 14 వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 11న అర్ధరాత్రి జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, మజ్జిగతో పాటు చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణానదిలో పడవ రాకపోకల అనుమతులు లేకుంటే తిరగడానికి వీల్లేదని అన్నారు. పడవల అనుమతి పత్రాలు ఉన్న వారు పంచాయతీ రాజ్‌ సిబ్బందికి అందించాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద బారికేట్‌లు, అన్నదాన ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మావతి, ఏఎస్‌ఐ మంగ్యానాయక్‌, ఆలయ సూపరింటెండెంట్‌ రత్నాకర్‌, సర్పంచ్‌ పేరయ్య, కార్యదర్శి జగ్గయ్య, మాజీ సర్పంచ్‌ జగ్జీవన్‌రామ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం

నందిగామ రూరల్‌: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని లింగాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ కామేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో లింగాలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల కిశోర బాలికలకు రుతుస్రావం, పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా ఆహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్‌ ఇన్‌చార్జ్‌ సీడీపీవో కృష్ణకుమారి, హెల్త్‌ సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, బిక్షాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

వత్సవాయి: ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో మండలంలోని భీమవరం, మక్కపేట, వత్సవాయి, మంగొల్లు, పెద్దమోదుగపల్లి, గోపినేనిపాలెం గ్రామాల్లో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వత్సవాయిలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్‌ అధికారులు, అంగన్‌వాడీలు

సీసీ రోడ్లను తనిఖీ చేసిన అధికారులు

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలో పంచాయతీరాజ్‌ శాఖ ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను మంగళవారం క్వాలిటీ కంట్రోల్‌ అధికారులు తనిఖీ చేశారు. అధికారి మోషేష్‌ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలోని ఆరు చోట్ల నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించి శాంపిల్స్‌ను తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌ పీఆర్‌ డీఈ శ్రీనివాసరావు, జేఈ కే శ్రీనివాసరావు, ఇంజినీరింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలికి అభినందన

జగ్గయ్యపేట అర్బన్‌: వైఎస్సార్‌ సీపీ అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు శాఖమూరి వెంకటకుమారికి ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు, పలువురు నేతలు అభినందనలు తెలియజేశారు. ఎన్టీఆర్‌ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలుగా ఇటీవల నియమితురాలైన వెంకటకుమారి మంగళవారం తొలిసారి జగ్గయ్యపేటలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు ఆమెను సన్మానించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ హఫీజున్నీసా ఫిరోజ్‌, పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు చల్లా సుశీల, పట్టణ అధ్యక్షురాలు షేక్‌ మున్నీహీరా, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆశ, మున్సిపల్‌ కార్మికులు సమ్మె నోటీస్‌ అందజేత

నందిగామ రూరల్‌: కార్మిక చట్టాలను పటిష్ట పరచడంతో పాటు లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్‌ పేర్కొన్నారు. ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరగనున్న యూపీహెచ్‌ ఆశవర్కర్ల సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆశావర్కర్స్‌ యూనియన్‌, సీఐటీయూ ఆధ్వర్యంలో డీవీఆర్‌ కాలనీలోని పీహెచ్‌సీలోని వైద్యాధికారికి మంగళవారం సమ్మె నోటీస్‌ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. ఆశవర్కర్లకు కనీస వేతనంతో పాటు వారిని పర్మినెంట్‌ చేయాలన్నారు. అదేవిధంగా ఒప్పంద జీవోలు అందించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. ఆశ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు నాగమణి, సుజాత, గోవిందమ్మ, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమ్మె నోటీస్‌ అందజేస్తున్న ఆశవర్కర్లు, గోపాల్‌

సమ్మెలోకి మున్సిపల్‌ కార్మికులు

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్‌ కార్మికులు మూడు రోజులు సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్‌ తెలిపారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ రమణబాబుకు మున్సిపల్‌ కార్మికులతో కలిసి మంగళవారం ఆయన సమ్మె నోటీస్‌ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా 21, 22 తేదీల్లో కూడా మున్సిపల్‌ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ కార్మికులను పర్మినెంట్‌ చేయాలని, ప్రైవేట్‌ ఏజెన్సీలను అనుమతించవద్దని కోరారు. వయో పరిమితిని 62 ఏళ్లకు పొడిగించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కరి వెంకటేశ్వరరావు, మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు సైదా, పుట్ట మాణిక్యం, మాదుగుల నాగరాజు, ఆశీర్వాదం, భూషి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్‌ కమిషనర్‌కు సమ్మె నోటీస్‌ అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్‌: గుంటూరు జిల్లా తెనాలిలో కాటూరు శిల్పకళ నిర్మాణ కార్యశాలలో ఛత్రపతి శివాజీ మహరాజ్‌ కాంస్య విగ్రహం నిర్మాణ పనులను మంగళవారం విగ్రహ నిర్మాణ కోర్‌ కమిటీ ప్రతినిధులు పిన్నం వెంగళరావు, పబ్బతి నరేంద్ర పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని జగ్గయ్యపేట పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో తొర్రగుంటపాలెం–దుర్గాపురం కూడలిలో వచ్చే నెల 9వ తేదీన విశ్వ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విగ్రహాన్ని పరిశీలించిన వారిలో కోర్‌ కమిటీ ప్రతినిధులు సంక భాస్కర్‌, నోముల రఘు, అల్లి రవిచంద్‌ ఉన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

కంచికచర్ల: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పలు ఆటలు, డ్రాయింగ్‌ నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఎండలో తిరగకుండా విద్యార్థులు గ్రంథాలయంలో పలు విభాగాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఇంగ్లిష్‌ చదవడం, రాయడం నేర్చుకోవాలని మనస్సుకు పదును పెట్టాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానం దక్కించుకోవచ్చని అన్నారు. అనంతరం డ్రాయింగ్‌, చెస్‌ ఆటలు నేర్పించారు. కార్యక్రమంలో డ్రాయింగ్‌, క్రాఫ్ట్‌ ఉపాధ్యాయులు కనకారావు, నీలం సర్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాసనాలపై శిక్షణ

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం గ్రంథాలయాధికారి రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పించడం, పలు రకాల ఆటలు ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని జిల్లా గ్రేడ్‌–1 శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో కథల పుస్తకాలను చదివించడం, కథలు చెప్పడం చేయించారు. అనంతరం యోగా టీచర్‌ ఎస్‌.లీలావతి విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. అలాగే ప్రభుత్వ ఇంగ్లిష్‌ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్‌ ఇంగ్లిష్‌ హ్యాండ్‌ రైటింగ్‌, మెలుకువలు నేర్పించారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్‌, రాము పాల్గొన్నారు.



కంచికచర్ల గ్రంథాలయంలో డ్రాయింగ్‌ వేస్తున్న విద్యార్థులు

బాలికల్లో ఆత్మస్థైర్యమే లక్ష్యం

- జూన్‌ 10 వరకు కిశోర బాలికలకు ప్రత్యేక కార్యక్రమాలు
- విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన

పెనుగంచిప్రోలు: సమాజంలో కౌమార దశకు చేరుకున్న బాలికల ఆరోగ్య, ఇతర సమస్యలు ఎదుర్కొనేందుకు కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మహిళా శిశు సంక్షేమ శాఖ వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇతర శాఖల సమన్వయంతో సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. మే రెండు నుంచి జూన్‌ 10 వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంపీహెచ్‌డబ్ల్యూ తదితరులతో కూడిన బృందాలు గ్రామాల్లో కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్య వివాహాలకు దూరంగా ఉండటం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. 14 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాలికలు.. అలాగే బడి మానేసిన 11 నుంచి 14 ఏళ్లలోపు బాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కిశోరి వికాసం.. షెడ్యూల్‌

మే రెండవ తేదీన బాలికల పరిచయం, ఆరవ తేదీ రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, తొమ్మిదిన పునరుత్పత్తి ఆరోగ్యం – బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, 13న బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన, 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 20న ఆడపిల్లల పట్ల లింగ వివక్ష – అసమానతలు, 23న ఉన్నత విద్య నైపుణ్యాలు, భవిష్యత్‌ మార్గ దర్శకం, 27న సైబర్‌ నేరాలు, ఆన్‌లైన్‌ భద్రత, వివిధ సమస్యలు ఎదుర్కోవడం, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, జూన్‌ మూడవ తేదీన కౌమార బాలికల నాయకత్వం – సాధికారత, ఆరవ తేది శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత, 10న బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, విచారణపై అవగాహన కల్పిస్తారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడేనా.?

గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా వేసవి సెలవుల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిసినా తల్లిదండ్రులు అవగాహన లేక, భారమనో చేస్తున్నారు. ఎవరైనా సమాచారం ఇస్తే అడ్డుకోవడం తప్ప అధికారులు పూర్తి స్థాయిలో నివారించలేకపోతున్నారు. దీనిపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



పెనుగంచిప్రోలులో కిశోరి వికాసంలో ఐసీడీఎస్‌ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు



ముండ్లపాడులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మీభార్గవి

ప్రత్యేక కార్యక్రమాలు



కిశోర బాలికలకు వేసవి సెలవులు ఉపయోగపడేలా అన్ని అంశాల్లో అవగాహన కల్పిస్తున్నాం. బాలికల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. కిశోర బాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జూన్‌ 10 వరకు ప్రతి శని, మంగళవారాల్లో కార్యక్రమాలు జరుగుతాయి.

– ఉషారాణి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌

చైతన్యవంతం చేస్తున్నాం



బాలికలు సమాజంలో ఎలా మెలగాలో అవగాహన కల్పించడంతో పాటు వారి హక్కులు, చట్టాలు తెలియజేస్తున్నాం. బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుత సమాజంలో బాలికలే లక్ష్యంగా జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించి, సమర్థవంతంగా ఎదుర్కొనేలా చైతన్యవంతం చేస్తున్నాం.

– లక్ష్మీభార్గవి, చిల్లకల్లు సెక్టార్‌ ఐసీడీఎస్‌ సీడీపీఓ

కుట్టు మిషన్ల పథకంతో దోపిడీ

నందిగామ టౌన్‌: బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పథకం పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీకి తెర తీసిందని వైఎస్సార్‌ సీపీ బీసీ సెల్‌ జిల్లా కన్వీనర్‌ మార్త శ్రీనివాసరావు పేర్కొన్నారు. కుట్టు మిషన్ల పథకంలో అవకతవకలకు పాల్పడుతోందని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో బాలకృష్ణకు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు దోచుకునేందుకే పథకం అంచనాలను అమాంతం పెంచి తక్కువ కోట్‌ చేసిన కంపెనీలను కాదని ఎక్కువ కోట్‌ చేసి సిండికేట్‌గా మారిన రెండు కంపెనీలకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వ దోపిడీకి అడ్డుకట్ట వేసి బీసీ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ మంచాల చంద్రశేఖర్‌, బీసీ సెల్‌ నియోజకవర్గ కన్వీనర్‌ పెరమసాని నరసింహారావు, యరగొర్ల రామారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



9 బ్యాగుల రేషన్‌ బియ్యం పట్టివేత

కంచికచర్ల: కంచికచర్లలో సోమవారం రాత్రి సమయంలో గోపి అనే వ్యక్తికి చెందిన వాహనంలో రేషన్‌ కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యం కన్నా తొమ్మిది బ్యాగులు అదనంగా ఉన్నట్లు గుర్తించామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరెడ్డి తెలిపారు. ఆ వాహనాన్ని పీడీఎస్‌ డీటీ సుమతికి అప్పగించామని చెప్పారు. గోపీపై కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐ తెలిపారు.